పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: జిల్లాలో మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు, శాఖాధికారులు, పేపర్ కస్టోడియన్లు, రూట్ అధికారులు, సహాయ రూట్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 641 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పరీక్ష గదులను సూచించాలని, తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ముఖ్య పర్యవేక్షకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి మర్యాల ఉదయ భాను, అధికారులు పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ డే

నృత్యం చేస్తున్న విద్యార్థులు

దహెగాం, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దౌలత్, అధ్యాపకులు చంద్రశేఖర్, సోమన్న, గణపతి, మహేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

అజోల్ల పెంపకం తొట్టిలను పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

నెన్నెల, ఫిబ్రవరి 24 : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ముందుకుసాగాలని మంచిర్యాల డీఆర్డీవో కిషన్ సూచించారు. మండలంలోని మన్నెగూడెం, నందులపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు యూనిట్లను సోమవారం పరిశీలించారు. రుణాలు తీసుకొని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు సంఘాల మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. నాటుకోళ్ల పెంపకం యూనిట్‌ను సందర్శించి, తీరును అడిగితెలుసుకున్నారు. నందుపల్లిలో అజోల్ల పెంపకం యూనిట్లను, పాఠశాల ప్రహరీ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్, ఏపీవో నరేశ్, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందించండి

చికిత్స పొందుతున్న తగరం రవి

భీమారం, ఫిబ్రవరి 24 : చేతికి అంది వచ్చిన కొడుకు దవాఖాన పాలయ్యాడని, వైద్యానికి డబ్బు లేక ఇబ్బందిపడుతున్నామని, దాతలు సాయం చేయాలని భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తగరం రవి తల్లిదండ్రులు బాలయ్య-శంకరమ్మ కోరుతున్నారు. ఈ నెల 19న అర్ధరాత్రి రవి మూత్ర విసర్జన కోసమని ఆరుబయటకు రాగా, స్పృహ తప్పి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు తలలో రక్తం గట్టకట్టిందని, శస్త్రచికిత్స చేశారు. కాగా, ఇప్పటికే రూ.4 లక్షల వరకు ఖర్చు చేశామని, తమది పేద కుటుంబమని ఎవరైనా ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా, కొద్ది రోజుల క్రితమే తమ చిన్న కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని, తోచిన సాయం అందించాలని వేడుకుంటున్నారు. దాతలెవరైనా గూగుల్‌పే, ఫోన్ పే నంబర్ 90149 17331(తగరం శ్రీకాంత్)కు ఆర్థికసాయం చేయాలని కోరుతున్నారు.

జీఎం కార్యాలయం ఎదుట సులభ్ కార్మికుల ధర్నా

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

మందమర్రి, ఫిబ్రవరి 24 : మందమర్రి పట్టణంలోని సులభ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న తమకు సకాలంలో వేతనాలను చెల్లించడంతో పాటు, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సోమవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట సులభ్ కాంప్లెక్ కార్మికులకు ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులతో కలసి నినాదాలు చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి ఎండీ జాఫర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజల సౌకర్యార్థం సింగరేణి యాజమాన్యం నిర్మించిన సామూహిక సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణను సోలో సంస్థకు అప్పగించిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో పాటు, యాసిడ్, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్, గ్లౌజులు తదితర సౌకర్యాలను కల్పించకుండా సంస్థ సూపర్‌వైజర్లు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే కార్మికుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. గడచిన జనవరి నెల వేతనాలను ఇంకా చెల్లంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అజయ్, కనకయ్య, వెంకటేశ్వర్లు, అప్పారావు, మల్లేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

- అక్రమ అరెస్టులతో ప్రభుత్వంపై వ్యతిరేకతను అణచివేయలేరు
- రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు
- బీఆర్ఎస్ నాయకుల మండిపాటు
- సీఎం పర్యటనల నేపథ్యంలో పలువురి ముందస్తు అరెస్టులు

రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని, అందుకు నిదర్శనమే బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆయా చోట్ల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడంపై మండిపడ్డారు.

జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 24 : చెన్నూర్ పట్టణంలో పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు రేవెల్లి మహేశ్, నాయకులు బుర్ర రాకేశ్ గౌడ్, వేముల మహేందర్, షఫీ తదితరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక్కడ నాయకులు మాట్లాడుతూ.. సీఎం పర్యటనను అడ్డుకుంటారనే అనుమానంతో ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఏడాదిపాలనలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీలేదని మండిపడ్డారు. తమను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కోటపల్లి, ఫిబ్రవరి 24 : కోటపల్లి మండలం రాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ సాంబాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కొట్టె నారాయణ, అక్కల మధూకర్, రాళ్లబండి శ్యామ్ సుందర్, ఆసంపల్లి సంపత్, బాపు నాయక్, కొట్రంగి మల్లేశ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి, కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మారిశెట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులను చేస్తూ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను అణచివేయాలని చూస్తున్నదని, ఇది సాధ్యం కాని విషయమన్నారు. బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులకు అరెస్టులు కొత్తేమి కాదని, తెలంగాణ ఉద్యమంలో లాఠీల దెబ్బలు, అరెస్టులకు భయపడకుండా ముందుకు వెళ్లడంతోనే ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా ఆనందంగా లేదన్నారు. రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్‌కు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24 : శ్రీరాంపూర్‌లో బీఆర్ఎస్ మండల కార్యదర్శి పంబాల ఎర్రయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ రఫీక్ ఖాన్‌ను ఎస్ఐ సంతోష్ వారి ఇంటికి వెళ్లి అరెస్ట్ చేశారు. ఆందోళనలు చేయకుండా ముందస్తు అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

జైపూర్, ఫిబ్రవరి 24 : జైపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు పెద్దపల్లి రమేశ్, పడాల వెంకాగౌడ్, బడుగు రవి, ఆర్నె సమ్మయ్య, జగన్‌గౌడ్, తిరుపతి గౌడ్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు.

భీమారం, ఫిబ్రవరి 24 : భీమారం మండలంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసరి మధుయ్యతో పాటు, యువ నాయకులు కుమ్రె బబ్లూ, వడ్లకొండ పవన్, దాసరి మణిదీపక్‌ను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి అప్రజాస్వామిక విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని, బీఆర్ఎస్ పార్టీకి బయపడే ముందస్తు అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు.

చెన్నూర్ టౌన్ : పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

భీమారం పోలీస్‌స్టేషన్‌లో..

శ్రీరాంపూర్ : పోలీస్‌స్టేషన్‌లో ఎర్రయ్య, రఫీక్‌ఖాన్

బ్యాలెట్ బాక్స్‌ల ర్యాండమైజేషన్ పూర్తి

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్
- ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 24 : ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బ్యాలెట్ బాక్సుల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలిసి ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 48 జంబో బ్యాలెట్ బాక్స్‌లతో పాటు, 8 అదనపు బాక్స్‌లు.., 48 స్మాల్ బ్యాలెట్ బాక్సులతో పాటు, 8 అదనపు బాక్స్‌లను కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో పట్టభద్రుల కోసం 40, ఉపాధ్యాయుల కోసం 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు ర్యాండమైజేషన్ ప్రక్రియలో కేటాయించిన ప్రకారం నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర సామగ్రి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భద్రతా చర్యల మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారులు, ఏజెంట్లు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఆర్థిక కార్యకలాపాలు చేయాలి..

ప్రణాలికాద్ధంగా ఆర్థిక కార్యకలపాలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, డీఆర్డీవో కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంతో కలిసి భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక కార్యకలాపాలను ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, బాధ్యతాయుతంగా అప్పు చేయాలని, సమయానికి తిరిగి చెల్లించి మంచి క్రెడిట్ స్కోర్ కొనసాగించాలని సూచించారు. వచ్చే ఆదాయంలో నెలసరి బడ్జెట్ ప్లాన్ చేసుకొని పొదుపు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

యోగా విజేతలకు బహుమతులు

మందమర్రి, ఫిబ్రవరి 24 : మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో డ్రీమ్ యోగా అండ్ ఫిట్‌నెస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులు అందజేశారు. పోటీల్లో సత్తాచాటి యోగా పుత్ర, పుత్రికగా ఎన్నికైన మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాకు చెందిన కొంపెల్లి రమేశ్, కాగజ్‌నగర్‌కు చెందిన సోనియా బిశ్వాస్‌కు నిర్వాహకులు అతిథులతో కలసి ట్రోఫీలతో పాటు, అవార్డులు అందజేశారు. అలాగే సూర్య నమస్కారాలు, వివిధ కేటగిరీల్లో విజేతలైన పురుషులు, మహిళలు, చిన్నారులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి కనపర్తి రమేశ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జే రవీందర్, కాంగ్రెస్ బీసీ సెల్ నాయకుడు కొత్తపల్లి రమేశ్, సొసైటీ వ్యవస్థాపకుడు ముల్కల్ల శంకర్, యోగా మాస్టర్లు బర్ల సదానందం, కొంపెల్లి రమేశ్, నిర్వాహకులు బడికెల సంపత్, మద్ది శంకర్, లయోల కుమార్, ఎగ్గేటి రాజేశ్వర్ రావు, పోలు సంపత్, ఎగ్గేటి రాజమౌళి, డీఎస్ రావు, దామోదర్, ముల్కల్ల సాయి, సిద్ధం సత్యం, బొంతు త్రిమూర్తి, పూసాల ఓదెలు, సాదుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఆర్టీసీ డీఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 24 : కార్మికులపై కక్ష సాధింపు చర్యలో భాగంగా తప్పుడు బ్రీత్ ఎనలైజర్‌తో కార్మికులను మోసం చేస్తున్న డీఎం విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఈ యూ డిపో సెక్రటరీ దివాకర్ గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. తప్పుడు ఎనలైజర్ కార్మికులు ఆల్కహాల్ తాగకున్నా తాగినట్టు చూపిస్తున్నదని దీని వల్ల కార్మికులు మానసిక ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. ఈ రోజు ఉదయం డ్యూటీకి వచ్చిన డ్రైవర్లకు ఆల్కహాల్ టెస్ట్ చేసినప్పుడు డ్రైవర్లు ఆల్కహాలు తాగకున్నా 30 శాతం తాగినట్టు చూపించిందని వాపోయారు. ఇలా కావాలని కార్మికులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న డీఎంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం స్పందించి డీఎంపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ డిపో ముట్టడిస్తామని హెచ్చరించారు.

అంధుల పాఠశాలలో అన్నదానం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 24 : షటిల్ క్రీడాకారుడు, స్వర్గీయ శ్రావణపూడి చిట్టిబాబు జ్ఞాపకార్థం నస్పూర్‌లోని విలేజ్‌శ్రీరాంపూర్ శ్రీసాయి అంధుల పాఠశాలలో విద్యార్థులు, వృద్ధులకు అంజనీపుత్ర రియల్ ఎస్టేట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సదానందం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, తిరుపతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాంచెరువు అభివృద్ధి పనులు చేపట్టాలి

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాంచెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 24 : అర్ధాంతరంగా నిలిచిపోయిన రాంచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ రాంచెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తౌటం శివాజీకి వినతిపత్రం సమర్పించారు. రూ.మూడున్నర కోట్లతో 2002 ఏప్రిల్‌లో ప్రారంభించిన పార్కు అభివృద్ధి పనులు గతేడాది నుంచి అర్ధాంతరంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. మంచిర్యాలతో పాటు, చుట్టుపక్కల ప్రజలకు ఉపయోగపడేలా సర్వాంగ సుందరంగా సువిశాలమైన ప్రదేశంలో పార్కు నిర్మించాలన్న సదుద్దేశంతో నిధులు మంజూరు చేసినా అది మధ్యలోనే ఆగిపోవడంతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఫలితంగా మంచిర్యాలవాసులకు పార్కుకు వెళ్లే భాగ్యం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంచెరువు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బూర్ల జ్ఞాని, కార్యదర్శి పూదరి నర్సయ్య, రాధాకృష్ణ, రాలబండి రాజన్న, ఆర్ శంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని రీజినల్ మేనేజర్ సోలోమాన్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వారం రోజులుగా డిపోలో సిబ్బందికి శిక్షణ అందించారు. సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎం మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న మెలకువలను సిబ్బంది పాటించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. డీఎం విశ్వనాథ్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవి 24 : శ్రీరాంపూర్ గనులు, స్టోర్లలో యాక్టింగ్ స్టోర్ ఇష్యూ మజ్దూర్లకు స్టోర్ ఇష్యూ మజ్దూర్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరక సోమవారం జీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సందీప్‌గౌడ్, రవిచందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పట్వర్ధన్

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 24 : చెన్నూర్ మండలం కిష్టంపేట డిగ్రీ కళాశాలలో శ్రీ తటవర్తి అంతర్జాతీయ గురుకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాల పద్యాల పోటీల్లో ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతులను అందచేసినట్లు ప్రిన్సిపాల్ పట్వర్ధన్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన్‌పెల్లిలో క్విజ్ పోటీలు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

దండేపల్లి, ఫిబ్రవరి 24 : దండేపల్లి మండలం రెబ్బెన్‌పెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో 6,7,8,9 తరగతుల విద్యార్థులకు మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. క్విజ్ పోటీల్లో రెబ్బెన్‌పెల్లి(ప్రథమ), దండేపల్లి(ద్వితీయ), ద్వారక (తృతీయ) పాఠశాలలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మంత్రి రాజు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి షర్ఫొద్దీన్, రూపాచారి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వాంకిడి, ఫిబ్రవరి 24 : మండలంలోని బెండర గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతు చేలలో ఏర్పాటు చేస్తున్న ఊటకుంట నిర్మాణ పనులను సోమవారం ఈజీఎస్ ఏపీవో శ్రావణ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్‌కార్డ్ కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పిస్తామన్నారు. అనంతరం పని ప్రదేశంలో పనిచేస్తున్న కూలీల మాస్టర్ రోల్ నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట టీఏ, ఎఫ్ఏలున్నారు.

యువతి ఆత్మహత్య

రెబ్బెన, ఫిబ్రవరి 24: రెబ్బెన మండలం గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని రేకులగూడ కాలనీకి చెందిన చింతకుంట్ల సంధ్య (22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, గోలేటి పంచాయతీ పరిధిలోని రేకుల గూడ కాలనీకి చెందిన చింతకుంట్ల పోషంకు నలుగురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పెద్ద కుమార్తె సంధ్య కూలీ పనులు చేస్తుంటుంది. సంధ్యకు 22 సంవత్సరాలు వచ్చినా ఇప్పటి వరకు రజస్వల కాలేదని ఇంట్లో కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడుతుండేది ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు రెబ్బెన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి సంధ్య మృతి చెందిందని నిర్ధారించారు. సంధ్య తండ్రి చింతకుంట్ల పోషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

దహెగాం, ఫిబ్రవరి 24 : మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కనకలక్ష్మిపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈనెల 11న సిర్పూర్(టీ) మండలంలో 208 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుపడగా విచారణ చేపట్టామన్నారు. కాగా బీబ్రా రేషన్ డీలర్ కనకలక్ష్మి పేరున ఉన్నప్పటికీ తనుకు శ్రీనివాస్ బినామీగా నడుపుతూ అక్రమంగా బియ్యాన్ని అమ్ముతున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. కాగా ఆతరైజ్డ్ డీలర్గె కనకలక్ష్మి కేసు నమోదు చేసి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు డీటీ పేర్కొన్నారు.

ఒకరికి జైలు

జన్నారం, ఫిబ్రవరి 24 : చర్చి ఫాస్టర్‌పై దాడి చేసిన ఘటనలో జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన కొండగొర్ల శ్రీనివాస్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.10 వేలు, అలాగే రాంచందర్‌కు రూ.10వేల జరిమానా విధిస్తూ లక్షెట్టిపేట కోర్టు న్యాయమూర్తి అసదుల్లా షరీఫ్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2017, ఫిబ్రవరిలో మురిమడుగు గ్రామంలోని సీఎస్ఐ చర్చి ప్రహరీ నిర్మిస్తున్న వారితోపాటు ఫాస్టర్ సాగర్ జాన్‌ను అదే గ్రామానికి చెందిన రాంచందర్, కొండగొర్ల శ్రీనివాస్ కొట్టారు. బూతులు తిడుతూ బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు సోమవారం కోర్టులో హాజరుపర్చగా, సాక్ష్యాదారాలు పరిశీలించిన జడ్జి తీర్పు వెల్లడించారని ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 24 : రామకృష్ణాపూర్‌కు చెందిన బిల్లా వంశీ కుటుంబానికి ఆల్ఫోన్సా పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం రూ.7 లక్షల (పోస్టాఫీస్ డిపాజిట్ పత్రం) ఆర్థిక సాయం అందించి తమ స్నేహాన్ని చాటుకున్నారు. వంశీ గతేడాది సెప్టెంబర్ 15న విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రామకృష్ణాపూర్ ఆల్ఫోన్సా ఉన్న పాఠశాల 2002 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు నిధుల సేకరణకు ముందుకువచ్చారు. వంశీ కుటుంబానికి సహాయంగా ఆయన పిల్లల భవిష్యత్ కోసం రూ.7 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని పోస్టాఫీసులో నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్సీ) పథకంలో డిపాజిట్ చేసి, ఆ పత్రాన్ని భార్య స్రవంతికి అందచేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాజీపూర్, ఫిబ్రవరి 24 : గుడిపేటలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో అదనపు వీసీబీ బ్రేకర్ పనులు నిర్వహిస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. గుడిపేట, చందనాపూర్, ముల్కల్ల గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌటాల, ఫిబ్రవరి 24 : మండలంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ కనెక్షన్ నేపథ్యంలో బెజ్జూర్, చీపురుదుబ్బ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్ డివిజన్ ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు. కౌటాల మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, కనికి, బోదంపల్లి, గ్రామాలతోపాటు, రెబ్బెన బీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 5 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగాదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెబ్బెన, ఫిబ్రవరి 24 : మరమ్మతుల కారణంగా మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెబ్బెన ఏఈ ఇమ్రాన్ తెలిపారు. ఆదర్శకాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, శ్రీరామకాలనీ, బృందావనం కాలనీ, ప్రధాన రహదారి ప్రాంతంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విశ్రాంత జీవితం ఆనందంగా గడపాలి

రిటైర్డ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు

రెబ్బెన, ఫిబ్రవరి 24: సింగరేణి డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి తన విశ్రాంత జీవితం ఆనందంగా గడపాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఆఫీసర్స్ క్లబ్‌లో సోమవారం విశ్రాంత డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డికి బెల్లంపల్లి ఏరియా అధికారులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ పురోభివృద్ధికి సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, క్లబ్ సెక్రటరీ వీరన్న, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఏరియా అధికారులున్నారు.

'బెదిరించి సభకు తీసుకెళ్తున్నరు'

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 24 : జిల్లాలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ప్రైవేట్ కళాశాలలు, పాఠశాల యాజమాన్యాలను స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు బెదిరించి మూసివేయించి ఉపాధ్యాయులు, లెక్చరర్లను సభకు తీసుకురమ్మనడమేమిటని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్‌ను కోరారు.